RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 22 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ ఆదివారం 26-04-2026 పేజీలు: 8, వెల : 2.00

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## ఇరాన్‌తో చర్చలకు..

# ట్రంప్ గ్రీన్ సిగ్నల్

## పాకిస్థాన్‌కు ప్రత్యేక రాయబారులు!

- ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా అంగీకారం
- పాకిస్థాన్‌కు ప్రత్యేక రాయబారులను పంపనున్న అధ్యక్షుడు ట్రంప్
- ఇరాన్ వైపు నుంచి సానుకూల సంకేతాలు వస్తున్నాయని వైట్‌హౌస్ వెల్లడి
- ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు

ఢిల్లీ,: అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఈ చర్చల కోసం పాకిస్థాన్‌కు ప్రత్యేక రాయబారులను పంపనున్నట్లు వైట్‌హౌస్ శుక్రవారం ప్రకటించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఈ వివరాలను వెల్లడించారు.

2వ పేజీలో...






## కవిత సారథ్యంలో..

# తెలంగాణ రాష్ట్ర సేన

# ఆవిర్భావం

- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు.



## కేదార్‌నాథ్‌కు పోటెత్తిన

# భక్తులు

## మూడు రోజుల్లో

## 90 వేల మంది దర్శనం

2వ పేజీలో...

- కేదార్‌నాథ్ ఆలయానికి భారీగా తరలివస్తున్న భక్తులు
- తొలి మూడు రోజుల్లోనే 90 వేల మందికి పైగా దర్శనం
- భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- అధికారిక సోషల్ మీడియా ద్వారానే సమాచారం తెలుసుకోవాలని సూచన



2వ పేజీలో...

## మరో 47మంది అజ్ఞాత మావోల

# లొంగుబాటు

### గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు

### తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్25 : తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు.

## మే 5నుంచి బెంగాల్లో..

# మహిళలకు స్వేచ్ఛ

కోల్‌కతా, ఏప్రిల్25 :ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు.

### రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు

### ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా



2వ పేజీలో...



## ప్రధాని నరేంద్రమోదీ

## తెలంగాణ పర్యటన

2వ పేజీలో...

# ఖరారు

### మే 9న తెలంగాణకు రానున్న

# ప్రధాని మోదీ

- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ
- పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ



## ఆప్‌కు స్వాతి మాలివాల్

# గుడ్‌బై..

2వ పేజీలో...

ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్ రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఆప్‌ను కుదిపేస్తున్న సమయంలో కేజ్రీవాల్ ఇంట్లో స్వాతి మాలివాల్‌పై వ్యక్తిగత కార్యదర్శి దాడి చేశాడు. అప్పట్లో పెను దుమారం రేపింది. అప్పటి నుంచి ఆమె పార్టీకి దూరంగా ఉంటున్నారు. తాజాగా పార్టీపై తిరుగుబావుటా ఎగరేసింది. కాషాయ గూటికి చేరింది.

తాజాగా 10 మంది ఆప్ రాజ్యసభ ఎంపీల్లో ఏడుగురు తిరుగుబావుటా ఎగరేశారు. ఏడుగురు ఎంపీలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిశారు. ముగ్గురు స్వయంగా కలవగా.. మరో నలుగురు కూడా చేరుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో మండు వేసవిలో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలినట్లైంది. అనర్హత వేటు తప్పించుకునేందుకు 2/3 వంతు చీలికతో బీజేపీలో విలీనం అవుతున్నట్లుగా రాఘవ్ చద్దా ప్రకటించారు. ఇది ఆప్‌కు ఊహించని షాక్ తగిలినట్లైంది. శుక్రవారం రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ బీజేపీ నేతలను కలవగా.. వారితో పాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ కూడా బీజేపీ గూటికి చేరుతున్నారు.

## రాజీనామా చేసినట్లు ప్రకటన

## కేజ్రీవాల్ తన ఇంటి నుంచి వెళ్లిన గంటల్లోనే

# రాజీనామా చేసిన అశోక్ మిట్టల్



ఏడాది కాలంగా అశోక్ మిట్టల్ నివాసంలో ఉంటున్న కేజ్రీవాల్ కుటుంబం
కేజ్రీవాల్‌కు జాతీయ పార్టీ అధినేత కింద భవనం కేటాయింపు
నిన్న తనకు కేటాయించిన భవనానికి వెళ్లిపోయిన కేజ్రీవాల్

ఢిల్లీ,: ఏడాది క్రితం ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తన నివాసంలోకి ఘన స్వాగతం పలికిన అశోక్ మిట్టల్, నిన్న కేజ్రీవాల్ తన నివాసాన్ని ఖాళీ చేసిన గంటల్లోనే పార్టీ మారి అధినేతకు షాకిచ్చారు. శుక్రవారం రాఘవ్ చద్దా సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఎంపీలు ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో అశోక్ మిట్టల్ కూడా ఉన్నారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ గత సంవత్సరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

# కవిత సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

మొదటిపేజీ తరువాయి...



ఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి...

తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే



ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

# కేదార్‌నాథ్‌కు పోటెత్తిన భక్తులు

మొదటిపేజీ తరువాయి...

రుద్రప్రయాగ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్న తర్వాత భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈ యాత్రా సీజన్‌లో ఆలయం తెరిచిన మొదటి మూడు రోజుల్లోనే 90,000 మందికి పైగా యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ నెల 22న బుధవారం హిమాలయాల్లోని ఈ ఆలయ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్న విషయం తెలిసిందే. కేదార్‌పురిలోని యాత్రా ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం రుద్రప్రయాగ్ ఎస్పీ నిహారికా తోమర్ ఈ వివరాలను వెల్లడించారు. "ప్రారంభ రోజుల్లో భక్తుల్లో భారీ ఉత్సాహం కనిపించింది. ఇప్పటివరకు 90 వేల మందికి పైగా యాత్రికులు దర్శనం పూర్తి చేసుకున్నారు" అని ఆమె తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం తొలి రోజైన ఏప్రిల్ 22న అత్యధికంగా 38,000 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రెండో రోజు 25,000 మందికి పైగా, మూడో రోజైన శుక్రవారం మరో 30,000 మందికి పైగా యాత్రికులు కేదార్‌నాథ్ చేరుకున్నారు.

భక్తుల భారీ తాకిడి నేపథ్యంలో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వివరించారు. జనసందోహాన్ని నియంత్రించేందుకు స్థానిక పోలీసులతో పాటు కేంద్ర పారామిలిటరీ బలగాలను కూడా మోహరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిని



ఎదుర్కొనేందుకు ఫైర్ సర్వీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. అంతకుముందు జిల్లా మేజిస్ట్రేట్ విశాల్ మిశ్రా, ఎస్పీ నిహారికా తోమర్‌తో కలిసి ఆలయ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు తీసుకుంటున్న చర్యలను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారు కీలక సూచనలు చేశారు. ప్రయాణానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం కోసం కేవలం పోలీసులు, జిల్లా యంత్రాంగం తాలూకు అధికారిక సోషల్ మీడియా ఖాతాలను మాత్రమే అనుసరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి ఇబ్బందులు పడొద్దని సూచించారు.

# మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా

## ఎపిలో పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బారులు తీరిన వాహనదారులు

### పెట్రోల్, డీజిల్ కోసం అగచాట్లు

అమరావతి,ఏప్రిల్25: ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో అనేక పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో ఇంధనం కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని సమాచారం. పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అయిపోవడంతో వాహనదారులు బంకుల వద్ద నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల బంక్ సిబ్బందితో వాహనదారుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా ఆయిల్ కంపెనీలు అప్పు ప్రతిపాదికన ఇంధన సరఫరాను నిలిపివేయడమేనని తెలుస్తోంది. పెండింగ్ బకాయిలు చెల్లించిన తర్వాతే సరఫరా పునరుద్ధరిస్తామని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేసినట్లు సమాచారం. పాత బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఈ సంక్షోభం ఏర్పడిందని తెలుస్తోంది. ఇక నష్టాలు, పరిశ్రమల్లో వినియోగం తగ్గుదల కూడా సరఫరాపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ సమీపంలో భారీ సంఖ్యలో ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద వందల సంఖ్యలో ట్యాంకర్లు స్టాండ్‌స్టిల్‌లో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కూడా సరఫరా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన సంక్షోభంపై నిన్న విజయవాడలో సివిల్ సప్లైస్ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, ఏపీ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. చర్చలు సఫలమయ్యాయని, నిరంతర సరఫరా కొనసాగుతుందని ఆయిల్ కంపెనీలు తెలిపినట్లు డీలర్స్ అసోసియేషన్ పేర్కొంది. అయితే సమావేశం తర్వాత కూడా పలు బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. సమస్యను వెంటనే పరిష్కరించి సాధారణ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పలు పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ కోసం వినియోగదారులు, రైతులు, వాహనదారులు టిన్నులతో బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వరి కోత యంత్రాల సహాయంతో పంట మాసూళ్లలో నిమగ్నమై ఉన్నారు. అయితే కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ బంకుల్లో అందుబాటులో లేకపోవడంతో కోత పనులు అంతరాయం కలుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఎలాగైనా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో డీజిల్ కొరత మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

# ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు

## పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు అనకాపల్లి పరిశ్రమలకు ఇదే ఆధారం మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

కాకినాడ,ఏప్రిల్25 : ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు. అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జూన్ నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు, ఏజెన్సీలను మంత్రి సున్నితంగా హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలు కీలకమన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించడానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా ఈ నీటిని అందిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ గత ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు నాడు జగన్ గండికొట్టారని మంత్రి నిమ్మల ఆగ్రహించారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తే, రెండో ప్రాధాన్యతగా లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించారని చెప్పారు.

కూటమి ప్రభుత్వం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవలోని 472 కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.30.38 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. పోలవరం ఎడమ కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు.

# ఆప్‌కు స్వాతి మాలివాల్ గుడ్‌బై..

మొదటిపేజీ తరువాయి...

అశోక్ మిట్టల్..: అశోక్ మిట్టల్.. కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాక ప్రభుత్వ బంగ్లా ఖాళీ చేయాల్సి వస్తే తన బంగ్లాలో ఉండాలని అశోక్ మిట్టల్ ఆహ్వానించారు. దీంతో ఏడాది పాటు కేజ్రీవాల్.. అశోక్ మిట్టల్ నివాసంలోనే ఉన్నారు. కానీ ఈ స్థాయిలో వెన్నుపోటు పొడుస్తాడని కేజ్రీవాల్ ఊహించలేకపోయారు. ఒకప్పుడు కేజ్రీవాల్ పట్ల విధేయత చూపించిన వాళ్లే.. ఇప్పుడు ద్రోహులుగా మారిపోయారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏప్రిల్ 2న రాఘవ్ చద్దాకు ఆప్ షాకిచ్చింది. రాజ్యసభలో డిప్యూటీ లీడర్‌గా ఉన్న రాఘవ్ చద్దాను తప్పించి ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. ఈ మేరకు రాజ్యసభ సచివాలయానికి అధికారిక లేఖను కూడా పంపింది. అంతగా అశోక్ మిట్టల్‌ను కేజ్రీవాల్ నమ్మారు. కానీ అతడే వెన్నుపోటు పొడుస్తాడని కేజ్రీవాల్ ఊహించలేకపోయారు.

# మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

మొదటిపేజీ తరువాయి...

'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించదని అమిత్ షా హామీనిచ్చారు.

# కేజ్రీవాల్ తన ఇంటి నుంచి వెళ్లిన గంటల్లోనే రాజీనామా చేసిన అశోక్ మిట్టల్

మొదటిపేజీ తరువాయి...

అప్పుడు ఆయన సీఎం నివాసం నుంచి బయటకు వచ్చారు. అశోక్ మిట్టల్ కేజ్రీవాల్ కుటుంబాన్ని తన నివాసంలోకి ఆహ్వానించారు. దీనితో ఏడాది కాలంగా కేజ్రీవాల్, ఆయన కుటుంబం మండీ హౌస్ సమీపంలోని రాజ్యసభ ఎంపీ అశోక్ మిట్టల్ అధికారిక నివాసంలో ఉంటోంది. ఏప్రిల్ 24న కేజ్రీవాల్ ఆయన నివాసం నుంచి వెళ్లిపోయారు. జాతీయ పార్టీ అధినేత హోదా కింద లోథి ఎస్టేట్‌లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించారు. దీనితో నిన్న ఆయన ఈ భవనంలోకి మారారు. కేజ్రీవాల్ తన భవనం నుంచి వెళ్లిపోయిన కొన్ని గంటల్లోనే అశోక్ మిట్టల్ ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం. నిన్న రాజీనామా చేసిన వారిలో రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ, స్వాతి మాలీవాల్ ఉన్నారు.

# ఇరాన్‌తో చర్చలకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్...

మొదటిపేజీ తరువాయి...

ఇరాన్ నుంచి సానుకూల సంకేతాలు వస్తున్నాయని, వారు నేరుగా చర్చలు జరపాలని కోరుకుంటున్నారని తెలిపారు. "దౌత్యానికి అవకాశం ఇవ్వడానికి అధ్యక్షుడు ట్రంప్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. అందుకే ప్రత్యేక రాయబారులు స్టీవ్ వాఫ్, జారెడ్ కుష్నర్‌లను పాకిస్థాన్‌కు పంపాలని నిర్ణయించారు. వారు రేపు ఇస్లామాబాద్‌కు బయలుదేరి ఇరాన్ ప్రతినిధులతో సమావేశమవుతారు" అని లెవిట్ వివరించారు. చర్చలు జరుగుతున్న సమయంలో అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో అమెరికాలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తారని ఆమె తెలిపారు. అవసరమైతే ఉపాధ్యక్షుడు పాకిస్థాన్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, చర్చలకు ముందు ఇరాన్ ఏదైనా నిర్దిష్ట ప్రతిపాదన పంపిందా అనే దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు. ఇదే సమయంలో, ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపును కూడా లెవిట్ ధ్రువీకరించారు. ఇది ప్రపంచానికి, అమెరికాకు దక్కిన మరో విజయమని, ట్రంప్ నాయకత్వంలో శాంతి స్థాపనకు జరుగుతున్న ప్రయత్నాలకు ఇది నిదర్శనమని ఆమె అన్నారు. ఫెడరల్ రిజర్వ్ ఆర్థిక నిర్వహణపై విచారణ కొనసాగుతోందని, దానిని ఇన్‌స్పెక్టర్ జనరల్ విభాగానికి బదిలీ చేసినట్లు లెవిట్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## బీజేపీకి రాహుల్ బలం...

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. "గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు.కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది.జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్-బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు.ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరెటివ్‌ను తయారు చేస్తుంది. మొత్తానికి బీజేపీ బిల్లుల విషయంలో ఓడిపోయినప్పటికీ, రాజకీయ వ్యూహాల్లో మాత్రం గెలిచిందని చెబుతున్నారు.

## మొదటి విడతలోనే మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

### కలెక్టర్, డిపిఆర్ఓలకు టీయూడబ్ల్యూజే –ఐజేయు నేతల వినతి పత్రం అందజేత



నాగర్ కర్నూల్ (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ మొదటి విడతలోనే అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని టీయూడబ్ల్యూజే--ఐజేయు నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ నేతలు శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, డిపిఆర్ఓ కిరణ్ కుమార్‌లకు వినతిపత్రం సమర్పించారు. మొదటి విడతలోనే మండల స్థాయి రిపోర్టర్లకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గతంలో అక్రిడిటేషన్ పొందిన అనుభవజ్ఞులైన రిపోర్టర్లకు విద్యార్హతల్లో సడలింపు కల్పించి కార్డులు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అర్హులైనవారందరికీ అక్రిడిటేషన్‌మంజూరు చేయాలని కోరారు. నల్లమల్ల ప్రాంతంలోని మన్ననూరు, బ్రహ్మగిరి కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐజేయు జిల్లా ఉపాధ్యక్షుడు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మొబిన్ ఖాన్, తాలూకా ఉపాధ్యక్షుడు జంగిటి రామ్ ప్రకాష్, ఐజేయు సీనియర్ నాయకుడు కొండకింది మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

## జంగాలపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెలాఖరు లోగా లబ్ధిదారులకు అందించాలి

### పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



రామగుండం (తెలంగాణ వాణి): జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.

శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీ తో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశించి, ఆ భూములను రెవెన్యూ శాఖకు కేటాయించి పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో ఆర్డిఓ గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి ని కలసిన ఎన్జీవోల సంఘ నాయకులు



కరీంనగర్ (తెలంగాణ వాణి) కరీంనగర్ జిల్లాకు ఇటీవల బదిలీపై విచ్చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి ని తెలంగాణ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం తరఫున ఆయనకు పూల బొకే అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లా పరిపాలనలో ఆయన అనుభవం, పారదర్శక విధానం, ప్రజా సంక్షేమంపై ఉన్న కట్టుబాటు కరీంనగర్ జిల్లాకు మేలు చేస్తాయని సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉద్యోగులతో సమన్వయం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, డిఎస్ఓ నర్సింగ్రావు, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మేందర్ సింగ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, రూరల్ అధ్యక్షులు కోడూరి వాస్తవిక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ల మాయలో పడకుండా..

# క్రీడల్లో ప్రతిభ చాటాలి

### క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే భవిష్యత్తుకు పునాది

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





కొత్తగూడెం (తెలంగాణ వాణి): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఈఆర్ క్లబ్బులో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్, గేమ్స్ కోచింగ్ క్యాంపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి విద్యార్థులలో అపారమైన ఉల్లాసాన్ని, ఏకాగ్రతను ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. వేసవి సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణాశిబిరం ఒక సువర్ణ అవకాశమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి తరం పిల్లలు ఇళ్లకే పరిమితమై సెల్‌ఫోన్ల మాయలో పడి సమయాన్ని వృథా చేయకుండా, మైదానాల్లో చెమటోడ్చి ఆడితేనే రేపటి చాంపియన్లుగా ఎదగగలరని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్, స్విమింగ్, యోగా, అథ్లెటిక్, నెట్ బాల్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ వంటి పది రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7వ తేదీ వరకు నెల రోజుల పాటు సాగనున్న ఈ క్రీడా సంబరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు, పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా కార్యాలయం అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ మహేందర్, బాక్సింగ్ మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంటేశ్వర్లు, మల్లికార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి సాగులో గాలి బాలకృష్ణకు రికార్డు దిగుబడి



ఖమ్మం (తెలంగాణ వాణి) ముదిగొండ మండలం, వల్లపురం గ్రామానికి చెందిన రైతు గాలి బాలకృష్ణ మిర్చి సాగులో విశేష విజయాన్ని సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. సాధారణంగా ఎకరానికి వచ్చే దిగుబడిని మించి ఈసారి ఆయన పొలంలో అధిక ఉత్పత్తి రావడం రైతుల్లో ఆసక్తి, ఆశ్చర్యం కలిగిస్తోంది. ముఖ్యంగా

### భగవాన్ 2525 విత్తనం సక్సెస్ స్టోరీ

మేఘన సీడ్స్ సంస్థకు చెందిన భగవాన్ 2525 విత్తనాన్ని వినియోగించడం ఆయన విజయానికి కీలకంగా మారింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించిన బాలకృష్ణ, భగవాన్ 2525 విత్తనంతో పాటు సమయానికి ఎరువులు, నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీంతో ఒక్క ఎకరానికి సుమారు 40 క్వింటాళ్లకు పైగా మిర్చి దిగుబడి సాధించినట్లు తెలిపారు. ఈ రకానికి మంచి రోగనిరోధక శక్తి, స్థిరమైన దిగుబడి లక్షణాలు ఉండటం వల్ల పంట నాణ్యత కూడా మెరుగ్గా వచ్చింది. మార్కెట్లో మంచి ధర లభించడంతో రైతుకు గణనీయమైన లాభాలు అందాయని రైతు తెలిపాడు. తన విజయంపై బాలకృష్ణ మాట్లాడుతూ, "సరైన విత్తనం ఎంపిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఉంటే వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చు. నేను ఉపయోగించిన భగవాన్ 2525 విత్తనం మంచి ఫలితాలు ఇచ్చింది" అన్నారు. ఇతర రైతులు కూడా నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారులు కూడా బాలకృష్ణను అభినందిస్తూ, ఆయన అనుసరించిన పద్ధతులు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ విజయంతో ప్రాంతంలోని రైతులు మిర్చి సాగుపై మరింత ఆసక్తి చూపుతూ, నాణ్యమైన విత్తనాల వైపు మొగ్గు చూపుతున్నారు.

## చిన్నారుల గర్భిణుల ఆరోగ్యంపై..

# ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల (తెలంగాణ వాణి): చిన్నారులు గర్భిణుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయశీలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమం ఈనెల 9 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు పిల్లలలో మొదటి 6 సంవత్సరాల కాలంలో మెదడు అభివృద్ధి గరిష్టంగా ఉంటుందని ఈ విషయం ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకుని ప్రత్యేక దృష్టిహాహాసాధించడం జరిగిందని చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం అత్యవసరమని గర్భిణి స్త్రీలు చిన్నపిల్లలకు సరైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని గర్భిణులు బాలల పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తొలి వేయి రోజులలో సరైన పోషణ శిశు అభివృద్ధిపై దృష్టి సారించాలని అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆటల ఆధారిత విద్యను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. పోషణ పంచాయతీలు సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిల్లలలో స్క్రీన్ టైమ్ తగ్గించే దిశగా తల్లిదండ్రులకు మార్గదర్శకాలు అందించాలని నలుగురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం బాలలకు అక్షరాభ్యాసం గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్థానిక సమాజం తల్లులు సంరక్షకులను భాగస్వామ్యం చేస్తూ పోషకాహారం పై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి



### జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత

జగిత్యాల (తెలంగాణ వాణి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా బీర్ పూర్ మండలంలోని నేదునూర్ గ్రామంలో శనివారం రోజున భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు నిర్వహించారు. భూమి రీ- సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా 1923 గురించి, సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి గ్రామ సభలో నేదునూర్ గ్రామ రైతులకు, గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు.ఈ కార్యక్రమానికి జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సర్వే, భూమి కొలతల అదికారి, బీర్ పూర్ తహశీల్దార్, మండల సర్వేయర్, మండల గిర్దావర్, ఆర్ ఐ లు, స్థానిక పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత జిపిఓలు, స్థానిక సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పాలన అదికారి, నూతనముగా అనుమతి పొందిన సర్వేయర్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కేదార్‌నాథ్‌లో వాటర్ బాటిల్ రూ.100





**కేదార్‌నాథ్ యాత్రలో నీళ్ల బాటిల్ ధరపై తీవ్ర చర్చ**
**లీటర్ వాటర్ బాటిల్ ధర రూ. 80 నుంచి రూ. 100**
**రవాణా కష్టాల వల్లే అధిక ధరలంటున్న వ్యాపారులు**
**బరువైన లోడ్లు మోస్తున్న కూలీల వీడియోలు వైరల్**
**ధరలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు**

ఢిల్లీ,: దేశంలోని అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు ఈ నెల 22న భక్తుల కోసం తెరుచుకున్నాయి. యాత్రికులు మంచు కొండల మధ్య కఠినమైన ప్రయాణం చేస్తూ స్వామిని దర్శించుకుంటున్నారు. అయితే, ఈ యాత్రలో ఒక చిన్న విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. అదే కేదార్‌నాథ్‌లో మంచినీటి బాటిల్ ధర. ఇక్కడ ఒక లీటర్ ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్ ధర రూ. 80 నుంచి రూ. 100 వరకు పలుకుతోంది. ఇది సాధారణ ఎంఆర్‌పీ కంటే నాలుగు నుంచి ఐదు రెట్లు ఎక్కువ. ఈ అధిక ధరపై ఓ పర్యాటకుడు దుకాణదారుడిని ప్రశ్నించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఆ వ్యాపారి ప్రశాంతంగా సమాధానమిస్తూ, అక్కడి వాస్తవ పరిస్థితులను వివరించాడు. “ఇక్కడికి సరుకులు తీసుకురావడానికి సరైన రోడ్లు లేవు, వాహనాలు రావు. మూడు కార్టన్ల లోడ్ తీసుకురావడానికే రవాణాకు రూ. 1500 అదనంగా ఖర్చవుతుంది. గాడిదలు లేదా మనుషుల వీపులపై మోసుకొని తీసుకురావాలి. ఇక్కడ దుకాణాల అద్దెలు కూడా చాలా ఎక్కువ. వ్యాపారం కేవలం 4-5 నెలలేఉంటుంది.మాకు పెద్దగాలాభాలు రావు” అని ఆవ్యాపారి వివరిచాడు. ఈ రవాణా వెనుక ఉన్న శ్రమను కళ్లకు కట్టే మరో వీడియో కూడా వెలుగులోకి వచ్చింది. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి తన వీపుపై భారీగా వాటర్ బాటిళ్లు, మిల్క్‌షేక్ ప్యాకెట్లను మోసుకెళ్తున్న దృశ్యం అందులో ఉంది. సుమారు 40 కిలోల బరువున్న ఈ లోడ్‌ను కేదార్‌నాథ్‌కు చేర్చినందుకు తనకు రూ. 2,500 వస్తుందని అతడు చెప్పాడు. ఈ వీడియోలు ఆన్‌లైన్‌లో పెద్ద చర్చకు దారితీశాయి. ఎత్తైన ప్రదేశాలకు సరుకులు చేర్చడంలో ఉండే కష్టాన్ని, శ్రమను చూస్తే ఈ ధర సమర్థనీయమేనని చాలామంది అభిప్రాయపడుతున్నారు. “ఏసీ హాల్‌లో రూ. 350 పెట్టి పాప్‌కార్న్ కొనగలం కానీ, రవాణా సౌకర్యం లేని కొండపై నీళ్లు కొనలేమా?” అని ఒకరు ప్రశ్నించారు. అయితే మరికొందరు మాత్రం, నీరు నిత్యావసరం కాబట్టి దానిపై ఇంత ధర వసూలు చేయడం సరికాదని వాదిస్తున్నారు. మొత్తంమీద కేదార్‌నాథ్ వంటి క్షేత్రాలలో అధిక ధరల వెనుక ఉన్న క్లిష్టమైన రవాణా వ్యవస్థ, శ్రమ, ఆర్థిక వాస్తవాలను ఈ చర్చ ఎత్తిచూపుతోంది.

## ఇండియా అంటే ఇదే అనుకున్నా..

# కానీ అంతకుమించి

**- భారత్‌లో తనను ఆశ్చర్యపరిచిన పది విషయాలపై విదేశీ యువతి మియా పోస్ట్**
**- ఇక్కడి ప్రజలు ఇంగ్లిష్ మాట్లాడే తీరు అద్భుతమని ప్రశంస**
**- మారుమూల ప్రాంతాల్లోనూ ఉబెర్ సేవలు అందుబాటులో ఉండటంపై ఆశ్చర్యం**
**- దేశవ్యాప్తంగా భారతీయ పర్యాటకులు ఎక్కువగా కనిపించడం ఊహించలేదన్న మియా**
**- చివరకు తాను ఇండియా ప్రేమలో పడిపోయానని వెల్లడి**



ఢిల్లీ,:భారత పర్యటనకు వచ్చిన ఓ విదేశీ యువతి, ఇక్కడి పరిస్థితులు, ప్రజల గురించి తన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకోగా అది ఇప్పుడు వైరల్‌గా మారింది. “ఇండియా నుంచి నేను ఊహించని 10 విషయాలు” అనే టైటిల్‌తో మియా అనే యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఎంతోమంది దృష్టిని ఆకర్షిస్తోంది.గోవాలో యోగా క్లాస్ ముగించుకున్న తర్వాత బీచ్‌పక్కన ఈ వీడియోచేసినట్టుఆమె పేర్కొంది. ఈ దేశం తనను ఎంతగానో ఆకట్టుకుందని, చివరికి ఇండియా ప్రేమలో పడిపోయానని ఆమె చెప్పింది. మియా తన పోస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను ప్రస్తావించింది. ముఖ్యంగా దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టివస్తున్న భారతీయ పర్యాటకుల సంఖ్యను చూసి తాను ఆశ్చర్యపోయానని చెప్పింది. తాను గతంలో పర్యటించిన దేశాల్లో ఈ పరిస్థితి చూడలేదని, మొదట్లో హాస్టళ్లలో తాము మాత్రమే విదేశీయులుగా ఉండటం వింతగా అనిపించినా, వెంటనే మంచి భారతీయ స్నేహితులు దొరికారని మియా వివరించింది. వారితో కలిసి వారం రోజులకు పైగా ప్రయాణించామని తెలిపింది. అలాగే, భారతీయుల ఇంగ్లిష్ భాషా నైపుణ్యంతననుఅబ్బురపరిచిందని మియా పేర్కొంది. “ఇక్కడి వారు చాలా స్పష్టంగా ఇంగ్లిష్ మాట్లాడుతున్నారు. స్లాంగ్ కూడా ఉపయోగిస్తున్నారు. చిన్నప్పటి నుంచే పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధించడం, సోషల్ మీడియా ప్రభావం ఇందుకు కారణమై ఉండొచ్చు” అని ఆమె అభిప్రాయపడింది. దీనివల్ల స్థానికులతో సులభంగా కలిసిపోగలిగానని చెప్పింది. ఇక, ఆధునిక సదుపాయాల గురించి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో కూడా ఉబెర్ వంటి క్యాబ్ సేవలు అందుబాటులో ఉండటం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని మియా తెలిపింది. డెలివరీ యాప్‌లు కూడా చాలా సులభంగా ఉన్నాయంది. ప్రతి రెస్టారెంట్‌లో చేతులు కడుక్కోవడానికి సింక్‌లు, సబ్బులు ఉండటం కూడా ఊహించని విషయమని ఆమె పేర్కొంది. దేశవ్యాప్తంగా చైనీస్, ఇజ్రాయెల్ వంటకాలు సులభంగా దొరికాయని, మంచి షక్షుకా, హమ్మస్ వంటివి కూడా తిన్నానని చెప్పింది. అయితే, కొన్ని జాగ్రత్తలు కూడా అవసరమని మియా సూచించింది. నకిలీ పనీర్, నీటి విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అలాగే రైళ్లలో ప్రయాణించాలంటే టికెట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని, సీట్లు త్వరగా నిండిపోతాయని తెలిపింది. చివరగా “నేను ఇండియా ప్రేమలో పడతానని నాకు ముందే తెలుసు” అంటూ తన పోస్ట్‌ను ముగించడం విశేషం.

# ‘ఉపాధి’లో సౌకర్యాలు కరువు



**- పొట్ట కూటి కోసం మండుటెండలోనే పని**

కాకినాడ :ప్రస్తుతం రాష్ట్రంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొట్ట కూటి కోసం మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉపాధి కార్మికులు పనులు చేస్తున్నారు. పని ప్రదేశంలో గుక్కెడు నీరు, నీడ కోసం చలువ పందిళ్లు, సరైన వసతులు లేకపోవడంతో అల్లాడిపోతున్నారు. దీనికి తోడు ముఖ హాజరు సమస్య కార్మికులను మరింతగా వేధిస్తోంది.కాకినాడ జిల్లాలోని 20 మండలాల్లో 280 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. 2.29 లక్షల జాబ్ కార్డులు ఉండగా 2.5 లక్షల మంది వేతనదారులున్నారు. జిల్లాలో ప్రతీ రోజు సగటున 1.4 లక్షల మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 20నుంచి 22వేలమంది పనులను వెళ్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా గతంలో పలు సౌకర్యాలు ఉండేవి. 2021 వరకూ పని ప్రదేశంలో ఎండ తీవ్రతను తట్టుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేసేవారు. లీటరు తాగునీటి కోసం రూ.2.50, గునపానికి రూ. పది, పార లేదా తట్టకి రూ.మూడు ఇచ్చేవారని, ఇప్పుడు అవేమీ ఇవ్వడం లేదు. ఐదేళ్ల నుంచి ఈ సౌకర్యాలు కనుమరుగయ్యాయి. పని ప్రదేశంలో టెంట్లు లేకపోవడంతో కార్మికులు మండుటెండల్లోనే పనులు చేస్తున్నారు. నీడలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు దుగ్గాడ శ్రీనివాసరావు, పి.రాయవరానికి చెందిన ఉబా బుల్లబ్బాయి, కలదారి రాఘవ, మంగితుర్తికి చెందిన దెక్కల లాజర్, తిమ్మాపురం గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి టెంట్లు సరఫరా లేదని, కొన్ని చోట్ల ఆరోగ్య కేంద్రాల్లో ఇచ్చిన ఒఆర్ఎస్ ప్యాకెట్లను అవసరమైన వారికి అందిస్తున్నామని ఫిల్డ్ అసిస్టెంటు పేర్కొన్నారు.

# టిఆర్ఎస్ ఆవిర్భావంతో బిఆర్ఎస్‌కు షాక్

## తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన




హైదరాబాద్, ఏప్రిల్25 : తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు ‘తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.

# సింగరేణి కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ

**సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో మెగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య శిబిరం**
**సింగరేణి ఆసుపత్రి ఏసిఎంఓ డాక్టర్ ఎం. ఉష**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి): సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగముగా వారి కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ సమస్యలు గల వారి కొరకు హైదరాబాద్ కు చెందిన రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శనివారం ఉచిత ప్రత్యేక మెగా గ్యాస్ట్రో ఎంటరాలజీ పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిఎంఓ ఎం.ఉష హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏసిఎంఓ ఎం.ఉష మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం విషయములో ముందు వరుసలో ఉంటుంది అని సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వారిచే జీర్ణవ్యవస్థ కు సంబందించిన వ్యాధులు, తీవ్రమైన లేదా దీర్ఘకాలికంగా వేధిస్తున్న కడుపు నొప్పి, తరచుగా గుండెల్లో మంట, ఆహారం మింగడంలో ఇబ్బంది, మలబద్ధకం లేదా రక్త విరేచనాలు, ఆకస్మికంగా బరువు తగ్గడం మొదలుగు లక్షణాలు గల వారి కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదే విధముగా ప్రతీ రెండవ ఆదివారం నాడు సింగరేణి ప్రధాన ఆసుపత్రి లో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను నిర్వహించుకుంటున్నామని వివరించారు. కాగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన మొత్తం 75 మంది కి నిష్ణాతులైన ఉచితముగా ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎండోస్కోపీ పరీక్షలను చేసి వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఎం.ఉష, డివై.సిఎంఓ లు నాగరాజు, కే.ఎస్ విశ్వమేధి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి. లలిత, రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది, మెయిన్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పుకొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతునారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా.. పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకున్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్ళీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్,ఉచిత గ్యాస్,ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

# పెట్రోల్ ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా ?




ముంబై, : పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో చమురు కొరత నెలకొంది. ఇప్పటికే ఎల్పీజీ ధరను కేంద్రం పెంచింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించడం లేదు. సీజ్‌ఫైర్ కుదిరినా శాశ్వత శాంతి ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు హర్మూజ్‌లో ఇప్పుడు అమెరికా పట్టు సాధించింది. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు గురించి వ్యాప్తమైన ఆందోళనలను తొలగించారు. ప్రభుత్వ స్థాయిలో అలాంటి ప్రతిపాదనలు లేవని ప్రకటించింది.సోషల్ మీడియాలో పెట్రోల ధరలు రూ.5 నుంచి 10 వరకు ధరలు పెరుగుతాయనే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందింది. ఈ వార్తలు వాహనదారులు, వ్యాపారు ల్లో టెన్షన్‌కు కారణమయ్యాయి. కేంద్రం ట్విట్టర్ ద్వారా తక్షణ స్పందించి, ఇలాంటి ప్రణాళికలు లేనటి వాస్తవాన్ని ప్రకటించింది.40 ఏళ్లుగా ఇంధన ధరల్లో మార్పు లేకుండా ఉన్న ఏకైక దేశం భారత్. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు 70?80 డాలర్ల మధ్య ఊపందు కున్నా, ప్రభుత్వం పోషక విధానాలతో పౌర భారాన్ని తగ్గించింది. ఈ స్థిరత్వం వాహన రవాణా, వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మేలు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20?30 శాతం పెరిగిన సమయంలో భారత్ ప్రభుత్వం పౌరాభివృద్ధి దృష్ట్యా చర్యలు తీసుకుంటోంది. డీజిల్‌పై వెయ్యి కోట్ల సబ్సిడీ, పెట్రోల్‌పై పన్ను తగ్గించి ధరలను అదుపులో ఉంచింది. దీంతో వీలయినంత తక్కువ ధరలతో పౌరులకు అందిస్తున్నారు.తప్పుడు ప్రచారంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. తాజాగా ప్రభుత్వం ముందస్తు సమాచారంతో అనవసర భయాలను నివారిస్తోంది. ఆర్థిక స్థిరత్వం కోసం ఇంధన విధానం మరింత బలపడుతుందని అంచనా.

# ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం




హైదరాబాద్ : సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీకే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రా ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది. అది కాస్త టీవీకే పార్టీకి ప్లస్ అయిందని రవి భావిస్తున్నాడు.. అతడు చేసిన ఈ ట్వీట్.. సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. మొన్నటిదాకా పైరసీ వ్యాపారం చేశావు.. ఇప్పుడేమో పొలిటికల్ గా మారిపోయావా.. ఏమైనాప్పటికీ నీ విశ్లేషణ వాస్తవ పరిస్థితికి దగ్గరగా ఉందని కొంతమంది అంటుంటే.. మిగతావారేమో ప్రశాంత్ కిషోర్ లాగా నువ్వు కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి.. కోట్లు సంపాదించుకో అంటూ మరి కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

# సీ ప్లేన్ తో పర్యటకానికి ఊపు

విశాఖపట్టణం, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీప్లేన్ సేవలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమైంది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండుచోట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తి చేశారు. అల్లూరి జిల్లాలోని సీలేరు, జోలాపుట్టు ప్రాంతాల నుంచి సీప్లేను నడిపేందుకు ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీప్లేన్‌లు నడిపేందుకు సిద్ధమైంది.. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల కూడా సీప్లేన్‌లు నడిపేందుకు కసరత్తు చేస్తోంది. అమరావతి, తిరుపతి, గండికోట ప్రాంతాలలో సీప్లేన్ ప్లాన్ చేశారు. అయితే ఉత్తరాంధ్రలోని ప్రకృతి అందాలకు, పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీప్లేన్‌లు నడపాలని నిర్ణయించింది. అల్లూరిసీతారామరాజు జిల్లాలో నీటిపై తేలుతూ, గాల్లో ఎగురుతూ ప్రకృతి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. సీప్లేన్ సర్వీసులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.జిల్లాలో సీప్లేన్‌లను జోలాపుట్టు, సీలేరు ప్రాంతాల నుంచి నడిపేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. సీలేరులోరూ. 16.08 కోట్లు.. జోలాపుట్టులో రూ. 16 కోట్లతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సీలేరులో ఉన్న గుంటవాడ జలాశయం దగ్గర ఉన్న మారెమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. అక్కడ సమీపంలోనే భూమిని ఈ సీప్లేన్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇక జోలాపుట్టు జలాశయం దగ్గర సీప్లేన్ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్‌లో విశాఖపట్న నుంచి ముంచంగిపట్టు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ మార్గంలో అరకు అందాలను వీక్షించవచ్చు. లంబసింగి, చింతపల్లి, సీలేరు ప్రాంతాలను.. గిరిజన సంప్రదాయాలు, జీవనశైలిని చూస్తూ అలా సీలేరులో ఏర్పాటు చేసే వాటర్ ఏరోడ్రోమ్ చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.సీప్లేన్ కోసం ఏరోడ్రోమ్‌లు ఏర్పాటు చేస్తే.. దాని చుట్టూ రెస్టారెంట్లు, భవనాలు, రెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువమంది వస్తుంటారు. ఈ సీప్లేన్‌లు అందబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రెండుచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌లు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మొత్తం మీద ఉత్తరాంధ్రలోని మన్యంలో రెండుచోట్ల సీప్లేన్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.. త్వరలోనే ఈ ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.

# ఉత్తరాంధ్రలో పుంజుకోని ఫ్యాన్



విశాఖపట్టణం, : ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒకప్పుడు దూకుడుగా ఉన్న వైసీపీ ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. కీలక నాయకులు ఉన్నప్పటికీ.. ఎవరికి వారు పార్టీలో స్వతంత్ర నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ఇది .. పార్టీని ముందుకు తీసుకువెళ్లకపోగా.. మరింత వెనక్కి నెడుతోందని తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కన్నబాబును ఉత్తరాంధ్ర ఇంచార్జ్‌గా నియమించిన తర్వాత.. పార్టీలో సహకారం కొరవడింది. దీంతో ఆయనను కేవలం విశాఖకు పరిమితం చేశారు.అయినా కూడా బొత్స సత్యనారాయణ సామాజిక వర్గం పార్టీలో వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. జిల్లాల పరంగా చూసుకుంటే.. టీడీపీ,జనసేనలకు ఉన్న బలం వైసీపీకి కనిపించడం లేదు. విశాఖలో ఎంపీ భరత్ సహా టీడీపీ సీనియర్లు.. పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. కానీ, ఇదేసమయంలో వైసీపీ తరఫున బలమైన వాయిస్ వినిపించే గుడివాడ అమర్నాథ్ వంటి వారికి పార్టీలో సహకారం అంతంత మాత్రమేనన్నది సీనియర్లే చెబుతున్నారు. ఇక, శ్రీకాకుళంలో ధర్మాన సోదరులపైనే వైసీపీ ఆధారపడింది. మాజీ మంత్రిసీదిరి అప్పలరాజును వైసీపీ నాయకులు పక్కన పెట్టేశారు. మరోవైపు.. ఇదే జిల్లాలో జనసేన, టీడీపీ తరఫున కింజరాపు ఫ్యామిలీ సహా.. ఇతర నాయకులు బలంగా పార్టీ లను ముందుకు తీసుకువెళ్తున్నారు. వీరి దెబ్బతో వైసీపీ ఎక్కడా పుంజుకునే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. పోనీ.. పాత నాయకులు అయినా.. బయటకు వస్తున్నారా? అంటే.. కేవలం మీడియా సమావేశాలకే పరిమితం అవుతున్నారు.ఇక, విజయనగరంలో వైసీపీ చీలికలు పేలికలుగా తయారైందన్నది పార్టీలో కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. జిల్లాలో బొత్స ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ద్వారా.. వైసీపీ పెద్ద పొరపాటు చేసిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, ఇదేజిల్లాలో జనసేన భారీగా పుంజుకుంటోంది. దీనికి టీడీపీ సహకారం కూడా తోడైంది. దీంతో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలలోనూ.. వైసీపీ వర్గ పోరుతో ముందుకు సాగలేక.. వెనక్కి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటే.. జనసేన+టీడీపీ ఉమ్మడిగా జిల్లాలను దున్నేసే పరిస్థితి నెలకొంది.

# ఓటరు మ్యాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్



వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) వనపర్తి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటరు మాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు.శనివారం అదనపు కలెక్టర్ వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఓటరు మాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామ పాలన అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన మాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న సాధాబైనామా, భూ భారతి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి నివేదికలు సమర్పించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో విచారణలో ఉన్న అన్ని రకాల సేవలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా, ఓటరు మాపింగ్ పనుల పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటరు మాపింగ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..

శ్రీకాకుళం, : ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణం పై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వానికి కూడా త్వరలో లేఖ రాయనున్నారు.శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదరు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహా ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.శ్రీకాకుళం జిల్లాలో ఈ నేరడి బ్యారేజి ఆలస్యంకావడంతో నీళ్ల మళ్లింపు కోసం సైడ్ వియర్ నిర్మించారు.. కానీ ఆ ప్రయత్నం విజయవంతంకాలేదు. హిరమండలంలో ఎత్తిపోతలను ప్లాన్ చేసి.. మొత్తం 19.5 డీఎంసీల నీళ్లు మళ్లించాలని భావించారు.. కానీ ఆ నిర్మాణం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఇప్పుడు నేరడి బ్యారేజి పనులు చేపట్టి పూర్తిచేస్తే తొలిదశలో లక్షా 48వేల ఎకరాలకు నీళ్లు అందించొచ్చని చెబుతున్నారు. రెండో రెండో దశలో మరో లక్షా 7వేల 280 ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చంటున్నారు. సాగునీరుతో పాటుగా తాగునీటి సమస్య కూడా తీరుతుందని.. వంశధార-నాగావళి అనుసంధానం పలితాలు దక్కుతాయంటున్నారు. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం నేరడి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి 1961లో తొలి అడుగు పడింది.. అప్పటి నుంచి కోర్టు చిక్కులతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేరడి బ్యారేజీ అంశం గురించి కేంద్రంతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లిన సమయంలో కేంద్ర జలశక్తిమంత్రి, ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల నేరడి బ్యారేజ్‌కు సంబంధించి.. వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చేసింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరినవాటిని పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది. త్వరలోనే ఒడిశా ప్రభుత్వానికి లేఖ రాసే అవకాశం ఉందంటున్నారు.

# అనవసర వివాదాలు..

హైదరాబాద్, : మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణ రావు.. జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందుకు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీమ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవి అందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు తరచూ చంద్రబాబును.. రేవంత్ రెడ్డిని ఇష్టానుసారంగా తిట్టే కేసీఆర్.. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకారులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

### కంబదూరు గిడ్డంగిలో ఉద్రిక్తత... ఖాళీల భర్తీపై హమాలీల ఆందోళన

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగిలో నూతన హమాలీల ఎంపికపై ఉద్రిక్తత నెలకొంది. గిడ్డంగిలో 12 మంది హమాలీలు అవసరం కాగా ప్రస్తుతం 7 మంది మాత్రమే పని చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ కొత్తగా 5 మంది హమాలీ పనికి దరఖాస్తు చేసుకుని అధికారులను కలిశారు. హమాలీల కొరత కారణంగా బియ్యం అన్‌లోడ్‌కు వచ్చిన వాహనాలు మూడు రోజులుగా నిలిచిపోయాయని తెలిపారు.

విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు, తహసిల్దార్ జోక్యంతో పోలీసుల పర్యవేక్షణలో బియ్యాన్ని వివిధ రేషన్ స్టోర్లకు తరలించారు. అయితే ఖాళీలు వెంటనే భర్తీ చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని స్థానికులు కోరారు.

# సినిమా

## సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం...



ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## నా పేరు కరసామి..



ధనుష్ రైతు పాత్రలో నటిస్తున్న పీరియాడిక్ డ్రామా 'కర'. 1991 నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. మమితాబైజు కథానాయికగా నటిస్తున్నది. విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్‌స్టార్ లాజిస్టిక్స్ సంస్థలు తెలుగులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాయి. 'పాపమో, పుణ్యమో తను నాటింది తానే నరుక్కోవాలి, నేను నాటిన విత్తనం ఇప్పుడు కోత కొచ్చింది. అంతకంటే ముందు నామీద పడ్డ మచ్చని తుడిచేయాలి. నన్ను నమ్ముకున్న వారిని ముందుకు తీసుకెళ్లాలి..నా పేరు కరసామి..' అనే వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గ్రామంలోని ఓ సమస్యను పరిష్కరించేందుకు కరసామి సిద్ధపడటం, ఈ క్రమంలో ఆయన ఎదుర్కొన్న అవరోధాలను ఆవిష్కరిస్తూ టీజర్ సాగింది. కె.ఎస్.రవికుమార్, కరుణాస్, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ సంగీతాన్నందిస్తున్నారు.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్‌కు కొనసాగింపు ఉంటుందా..

## రెండో భాగంపై జోరుగా ఊహాగానాలు




పాప్ ప్రపంచానికి రారాజుగా నిలిచిన మైఖేల్ జాక్సన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం "మైఖేల్" ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటోంది. నిజ జీవితంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు అయిన జాఫర్ జాక్సన్ ప్రధాన పాత్రలో నటించడం ఈ సినిమాకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ లెజెండరీ గాయకుడిని ఎంతగానో ఆరాధించే అభిమానులు సినిమా చూసి భావోద్వేగానికి లోనవుతున్నారు. ఈ బయోపిక్‌లో మైఖేల్ జాక్సన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే సినిమా విడుదలైన వెంటనే మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదేంటంటే... ఈ కథను ఒక్క భాగంలోనే ముగిస్తారా? లేక రెండో భాగం కూడా ఉంటుందా? అనే ప్రశ్న. ఈ సందేహాలకు కారణం సినిమా ద్వితీయార్థంలో కనిపించే కొన్ని సూచనలు. కథ పూర్తిగా ముగియకుండా, మరింత చెప్పాల్సిన అంశాలు మిగిలినట్లుగా చూపించడంతో రెండో భాగంపై సంకేతాలు ఇచ్చినట్టుగా అభిమానులు భావిస్తున్నారు. ఇదే సమయంలో రెండో భాగానికి సంబంధించిన శీర్షికపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి. ప్రస్తుతం వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, మొదటి భాగం "మైఖేల్"గా విడుదల కాగా, రెండో భాగానికి "మైఖేల్ జాక్సన్" అనే పూర్తి పేరునే టైటిల్‌గా పెట్టవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఇది వినడానికి సాధారణంగా అనిపించినా, ఇందులో ఒక లోతైన భావన ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగంలో వ్యక్తిగత జీవితాన్ని, రెండో భాగంలో ఆయన సంపూర్ణ లెజెండరీ ప్రయాణాన్ని చూపించేలా ప్లాన్ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, రెండో భాగాన్ని 2028 ఏప్రిల్‌లో విడుదల చేసే అవకాశముందన్న మరో వార్త కూడా ప్రచారంలో ఉంది. అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఇవన్నీ కేవలం ఊహాగానాలేనా? లేక నిజంగానే రెండో భాగం వస్తుందా? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, "మైఖేల్" సినిమా విజయంతో మైఖేల్ జాక్సన్ జీవిత కథపై మరింత ఆసక్తి పెరిగింది. రెండో భాగంపై వస్తున్న ఈ వార్తలు నిజమైతే, ఈ లెజెండరీ బయోపిక్ అరుదైన ఘనతను సొంతం చేసుకునే అవకాశముంది.

## మండాడి షూటింగ్ కంప్లీట్..

## గెట్ రెడీ అంటోన్న సుహాస్, సూరి..

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ సుహాస్. ఈ టాలెంటెడ్ యాక్టర్ మండాడి సినిమాతో కోలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇస్తున్నాడని తెలిసిందే. కథను నమ్మి సినిమా చేసే సుహాస్ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకోవాలనుకుంటున్నాడు. సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కోలీవుడ్ యాక్టర్ సూరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామా షూటింగ్ పూర్తయింది. జెట్‌స్పీడ్‌తో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చాలెంజింగ్ షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిందని తెలిపారు మేకర్స్. సినిమా రియలిస్టిక్‌గా ఉండాలనే ఉద్దేశంతో రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయడం విశేషం. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు నెట్టింట, మూవీ లవర్స్‌లో హైప్ క్రియేట్ చేస్తున్నాయి. సుహాస్, సూరి టీంపై వచ్చే హై ఇంటెన్సిటీతో సముద్రంలో సాగే యాక్షన్ పార్ట్‌తోపాటు సెయిల్ బోట్ రేస్ సినిమాకే హైలెట్‌గా ఉండబోతుందంటూ అప్‌డేట్స్ కూడా వచ్చాయి. ఈ సీక్వెన్స్ కోసం సూరి, సుహాస్ టీం ప్రత్యేకంగా ఆరు నెలలపాటు కఠిన శిక్షణ పొందారని ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీకి పాపులర్ యాక్షన్ కొరియోగ్రఫర్ పీటర్ హెయిన్స్ పనిచేస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ మూవీకోసంసుహాస్‌వందరోజులను కేటాయించాడు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించగా.. ఎస్‌ఆర్ కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నారు.

## అభిమానుల్లాగే నేనూ వెయిటింగ్..

## అకీరా నందన్ సినీ ఎంట్రీపై అడివి శేష్ ఆసక్తికర వ్యాఖ్యలు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రం ఎప్పుడు జరుగుతుందా అని మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో యువ హీరో అడివి శేష్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తన తాజా చిత్రం 'డెకాయిట్' హిట్ అయిన సందర్భంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ క్రమంలో అకీరాతో అడివి శేష్.. అకీరాతో తనకున్న అనుబంధం, ఆయన సినీ భవిష్యత్తు గురించి మాట్లాడారు. గత కొంతకాలంగా అకీరా సినీ ఎంట్రీ కోసం అడివి శేష్ ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై శేష్ స్పందిస్తూ.. "అకీరాకు ఇప్పటికే విపరీతమైన అభిమానగణం ఉంది. ఆయన ఎంట్రీ కోసం లక్షలాది మంది అభిమానుల లాగే నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని తెలిపారు. అకీరా ఎప్పుడు ఇండస్ట్రీలోకి వచ్చినా అది ఒక పెద్ద సంచలనం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అకీరాతో తనకున్న వ్యక్తిగత బంధం గురించి శేష్ వివరిస్తూ.. "అకీరా నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. మేమిద్దరం అప్పుడప్పుడు కలుస్తుంటాం. మా ఇద్దరి మధ్య ఒక కామన్ పాయింట్ ఉంది. మేమిద్దరం 'లెఫ్ట్ హ్యాండర్స్' (ఎడమచేతి వాటం ఉన్నవారు). ఆ విషయంలో మా మధ్య మంచి సింక్ కుదిరింది" అని నవ్వుతూ చెప్పారు. అకీరా ఆలోచనా విధానం, ఆయన పరిణతి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని శేష్ ప్రశంసించారు.

నటుడిగా వస్తాడా? సంగీత దర్శకుడవుతాడా? : ప్రస్తుతం అకీరా నందన్ అకీరానందన్ ప్రస్తుతం విదేశాలలోసంగీతంలో శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. గతంలో ఆయన తల్లి రేణు దేశాయ్ కూడా తన కొడుక్కి సంగీతంపైనే మక్కువ ఎక్కువని, కెరీర్ ఎంపిక పూర్తిగా అతనికే వదిలేశామని స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ సైతం తన పిల్లల ఇష్టాలకే ప్రాధాన్యత ఇస్తారని తెలిసిందే. ఈ నేపథ్యంలో అకీరా కథానాయకుడిగా అడుగుపెడతాడా? లేక సంగీత దర్శకుడిగా? తన ప్రయాణాన్ని ప్రారంభిస్తాడా అనేది ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా అడివి శేష్‌వ్యాఖ్యలతో అకీరా ఎంట్రీపై మరోసారి జోరుగా చర్చ మొదలైంది.

## చంద్రబాబు బయోపిక్ అడుగులు



తెలుగు రాజకీయ నేతల బయోపిక్ లు మంచి ఆదరణ పొందాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్ యాత్ర సినిమా ద్వారా తెరకెక్కించారు. విశేష ప్రేక్షకాదరణ పొందింది ఆ చిత్రం. ఎన్టీఆర్ కథానాయకుడు, నాయకుడు పేరిట బయోపిక్ వచ్చింది. ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ పాత్రలో మెప్పించారు. అయితే ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు బయోపిక్ రానుంది. చంద్రబాబు జీవితంలోని ముఖ్యమైన సంఘటనల ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ మేరకు దర్శకుడు భానుశంకర్ ప్రకటన చేశారు. రాజధాని ఫైల్స్ చిత్రంతో అమరావతి రైతుల త్యాగాన్ని, రాజధాని అవసరాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు దర్శకుడు భాను ప్రకాష్. ఆ చిత్రంతో బాగానే మెప్పించారు. ఇప్పుడు చంద్రబాబు బయోపిక్ తీయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా చంద్రబాబు రాజకీయ జీవితం అంటే చాలా రకాల పాత్రలు ఉంటాయి. దీంతో చంద్రబాబు పాత్ర ఎవరు పోషిస్తారు? మిగతా పాత్రధారులు ఎవరు? అనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సామాన్యుడిగా జీవితం ప్రారంభించి.. విద్యార్థి సంఘ నేతగా ఎదిగి.. రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబు( రాణించిన తీరు భిన్నంగా ఉంటుంది. ఆయన ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదే. అయితే చంద్రబాబును సినిమాలో ఎలా చూపిస్తారు అనేది ఇప్పుడు ఆసక్తి. చంద్రబాబు జీవితంలో జరిగిన ప్రతి ఘట్టంలో ఒక ఉద్వేగం, ఒక సంఘర్షణ దాగి ఉంది. దానిని బయోపిక్ లో చూపిస్తాను అంటున్నారు దర్శకుడు భాను ప్రకాష్.. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, నిర్మాణ సంస్థ వివరాలు, షూటింగ్ విశేషాలు, ఇతర సమాచారం త్వరలో వెల్లడిస్తానని చెబుతున్నారు భాను ప్రకాష్. చంద్రబాబు పాత్రలో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. ఎన్టీఆర్ బయోపిక్ లో చంద్రబాబు పాత్రధారిగా దగ్గుబాటి రానా నటించారు. అయితే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన సినిమాల్లో చంద్రబాబు పాత్రధారి బాగా ఆకట్టుకున్నారు. ఆయన అయితే అచ్చం గుద్దినట్టు సరిపోతారు అనేది ఒక అంచనా. మరోవైపు ఇతర నేతలు, ముఖ్యుల పాత్రల కోసం ఎవరిని ఎంపిక చేస్తారు అనేది ప్రశ్న. చిన్న స్థాయి నుంచి ప్రారంభమైన చంద్రబాబు ప్రయాణం.. క్రమంగా రాజకీయాల్లో ఎదుగుతూ రాష్ట్ర నాయకుడిగా మారిన తీరు ఈ సినిమా ఇతివృత్తం. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రజల కోసం చేసిన పనులు వంటి వాటిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారట. ముఖ్యమంత్రిగా సాధించిన మైలురాళ్లు, ప్రతిపక్ష నేతగా చేసిన యాత్రలు, నందమూరి కుటుంబంతో ఉన్న అనుబంధం, అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడి, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అరెస్టు.. ఇలా అన్ని ఎపిసోడ్లు ఉండనున్నాయని తెలుస్తోంది.

# జిల్లాలో రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





జయశంకర్ భూపాలపల్లి (తెలంగాణ వాణి) జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనగణన స్వీయ నమోదు, వరి కోతలపై హార్వెస్టర్లకు అవగాహన కార్యక్రమం తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రానున్న సోమవారం నుండి 5 రోజుల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ఇందుకు తక్షణం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 69.66శాతం ఓటర్లు మ్యాపింగ్ జరిగిందని, గత రెండు నెలలుగా పురోగతి రాలేదని స్పష్టం చేశారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఓటర్ మ్యాపింగ్ కోసం ఎన్నికల సంఘం పోర్టల్ నుండి డేటాను డౌన్‌లోడ్ చేసి, మ్యాప్ కాని ఓటర్ల జాబితాను సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం మండల స్థాయిలో బిఎల్‌ఓ లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు బూతు స్థాయి ఏజంట్లు నియమించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీ నుండి స్వీయ జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్నందున, జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా మండల స్థాయిలో కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సిబ్బంది స్వీయ జనగణనలో పాల్గొనేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 26 నుండి వచ్చే నెల 10 వరకు స్వీయ జనగణన జరుగుతుందని, 11వ తేదీ నుండి ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేటర్లు జనగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న స్వీయ గణన నమోదులో ప్రముఖులను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధాన్యంలో తాలు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. హార్వెస్టర్లతో పాటు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా హార్వెస్టరులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్పీఎం 18 నుండి 20 మధ్య ఉండేలా, బ్లోయర్ సరిగా పనిచేసేలా చూసుకోవాలని, అలాగే యంత్రం బి2 నుండి ఏ1 గేజ్ ఉండేలా అవగహన కల్పించాలని, దీంతో తాలు రాకుండా ఉంటుందని తద్వారా కొనుగోలు సులభతరం అవుతుందని వివరించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, సీపీఓ జవహర్, వ్యవసాయ అధికారి బాబూరావు, అన్ని మండలాల తహసీల్దార్ల తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కర్కోటకుడి పాలన



## గురుకులాల్లో పిల్లలు చనిపోతున్న పట్టింపేదీ సిఎం రేవంత్ పాలనపై కవిత విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్25 : ఇది ప్రారంభం మాత్రమే, ఇన్‌ఫ్రంట్ దేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్ అని కొతత్గా టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని.. ఒక రాజకీయ నేతను అలా అనకూడదు.. కానీ, అనాల్సి వస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం మాట్లాడట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. అందుకే కర్కోటకుడని అంటున్నాం.. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం, రెండేళ్ల తర్వాత మనదే అధికారమన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కొత్త పార్టీ పేరు ప్రకటించిన ఆమె రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాంచజన్యం పేరుతో ఐదు హామీలు ప్రకటించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపతేం చేస్తూనే ప్రైవేట్ స్కూళ్లలో కూడా ఫ్రీగా విద్య అందిస్తాం.. ఏ రోగమైనా రానీ, ఏ ఆస్పత్రైనా సరే ఉచితంగా అందిస్తాం.. వ్యవసాయం: రైతే రాజు అన్న నినాదాన్ని నిజం చేస్తాం.. ఉపాధి: రూ.2 లక్షల-రూ.20 కోట్ల వరకు యువతకు రుణాలు..ప్రభుత్వం దావారానే అందిస్తాం. మొదటి ఏడాదిలోనే సింగిల్ నోటిఫికేషన్‌లో 4 లక్షల ఉద్యోగాలు నియమిస్తాం. ఉద్యమకారుల కు లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు ఇస్తాం.. . సామాజిక న్యాయం సాధించాల్సిందే' అని ప్రకటించారు.అనంతరం బీఆర్ఎస్, కేసీఆర్ గురించి కవిత మాట్లాడారు. 'మన కేసీఆర్ అయ్యింటే పాలమూరు ప్రాజెక్టును కట్టించేవారు. మారిన కేసీఆర్ పంజాబ్ వెళ్లారు. జాతీయ పార్టీ పెడతానని చెప్పారు. సింగరేణిలో గనిలో కార్మికుడు చనిపోతే చూసొచ్చే వ్యక్తి. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. కేటీఆర్ మాట్లాడారంటే అనుకోవచ్చు. ఆయనకు రాజకీయం తెలియదు. ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. ఇళ్లను కూల్చుతుంటే ఆదుకోవాల్సిన అమ్మలాంటి కేసీఆర్ ఎక్కడున్నారు..? మారుతారేమోనని చూశా.. కానీ, నన్నే సస్పెండ్ చేశారు. ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు పంపిన రోజే తాను మాట్లాడాల్సింది. కానీ, మాట్లాడలేదు.. ఇవాళ నాకు అదే జరిగింది. ఉద్యమంలో కొట్టినవారినే తీసుకొచ్చి పట్టం కట్టారు. వాళ్ల అనుచరులు మనవాళ్లను అణగతొక్కారు. ఉద్యమకారులను నామినేటెడ్ పోస్టులు ఇచ్చినా సరిపోయేది. కండువా వేసుకొని అప్పుడు పిచ్చోల్లలాగా తిరిగాం. ఆ పార్టీలో అమ్మతనం పోయింది, మమకారం పోయింది. అందుకే కేసీఆర్ మన కేసీఆర్ కాదు. మరబొమ్మ అయ్యారు అని కవిత వ్యాఖ్యానించారు.

# 4 రోజుల్లో పెండింగ్ త్రాగునీటి సమస్యల పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) వేసవికాలంలో త్రాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలంపి.ఓ రాహుల్,సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ వేసవిలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలోత్రాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్‌వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్‌ఓ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా త్రాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తికొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని , ఎక్కడా నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న త్రాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో..

# మౌలిక వసతులను అభివృద్ధి చేస్తాం

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి): నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలో లబ్ధిదారులకు అందుతున్న సదుపాయాలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మాణం, వాటర్ లీకేజీ, లిఫ్ట్ ల నిర్వాహణ, నీటి సంపు, ప్రార్థన మందిరాలపై స్థలాల కేటాయింపు, పార్కుల అభివృద్ధి, అంగన్ వాడీ, బస్తీ దవాఖాన, స్మశాన వాటికకై స్థలం కేటాయింపు వీధి దీపాల ఏర్పాటు సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యే విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలోని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో ఇండ్లలో మౌలిక వసతులతో పాటు ప్రార్ధన మందిరాలు, వైకుంఠధామాలకు స్థలాలు కేటాయించి అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు, రెవెన్యూ, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ విభాగాలతో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆగం రాజు, చందు, గాజుల సుజాత, రంగరాయ ప్రసాద్, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయ కమిటీ సభ్యులు ఫర్జానా సలీం, షేక్ అహ్మద్, కె. రాజు, బిపిన్, లాజర్, జయరాజు, నరసింహ, రవి, రమేష్, కృష్ణ, వెంకట్రావు, శివ ప్రసాద్, రఫీక్, పాల్గొనా చారి, షాహిన్ శర్మ, ఝాన్సీ, గంటా రాము, ప్రదీప్, వినయ్, గిరిబాబు, హైమద్, లబ్ధిదారులు, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గడ్డలో మలేరియా అవగాహన ర్యాలీ



హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) మలేరియా రహిత సమాజం లక్ష్యంగా అందరం కలసి కట్టుగా పనిచేయాలని , ప్రజలను భాగస్వాములుగా చేయాలని హనుమకొండ డీఎంహెచ్వో డాక్టర్ ఎ. అప్పయ్య పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం నుండి నిర్వహించిన ర్యాలీని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.మదన్మోహన్రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడమే కాకుండా దోమల ఆవాసాలను నిర్మూలించడంలో,ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్పటికీ మలేరియా పాజిటివ్ కేసులు నమోదు ఉన్నాయని, పట్టణ పరిధిలో జి డబ్ల్యూ ఎం సి తో గ్రామీణ ప్రాంతంలో పంచాయతీ సిబ్బందితో పాటు సమన్వయంతో సేవలందించాలన్నారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా మాట్లాడుతూ పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది సేవలు బాగా అందిస్తున్నారని, పెద్దమ్మ గడ్డ పరిధిలో స్లమ్ ఏరియాలు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని, విజ్ఞప్తి చేశారు. ర్యాలీ పెద్దమ్మ గడ్డ వీధుల గుండా కార్డులు నినాదాలతో చివరిగా పెద్దమ్మ గడ్డ జంక్షన్లో మానవహారం నిర్వహించి 2030 కల్లా మలేరియా నిర్మూలించడంలో భాగస్వాములు అవుతావని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి,హనుమకొండ రాజు, డెమో వి అశోక్ రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు ఖాదర్ అబ్బాస్ ,విప్లవ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు బాబు ,గోవర్ధన్ రెడ్డి, ప్రసాద్ హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశాలు కెఎంసి నర్సింగ్ కళాశాల విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

## ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు

హైదరాబాద్:బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు.

# తెలంగాణలో జనగణన..

## భారతి హోళికేరి కీలక ప్రకటన!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియలో భాగంగా నిర్వహించే 'స్వీయ ధ్రువీకరణ' మరియు తొలి విడత గణనపై రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి శనివారం మీడియా సమావేశంలో కీలక వివరాలను వెల్లడించారు. ఇవాల్టి (ఆదివారం) నుంచి మే 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్ అంటే ఏమిటి?: సాధారణంగా జనగణన సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారు. అయితే సాంకేతికతను జోడించి ఈసారి ప్రజలే నేరుగా తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనినే 'సెల్ఫ్‌ఎన్యుమరేషన్' అంటారు. ప్రజలు దేశంలో ఎక్కడ ఉన్నా సరే, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమకుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని భారతి హోళికేరి సూచించారు. అయితే.. ఇది ప్రతి ఒక్కరికీ తప్పనిసరికాదు, కేవలం ఒకఆప్షన్ మాత్రమే అనిఆమెస్పష్టం చేశారు.

33 ప్రశ్నలతో కూడిన గణన:జనగణనలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని డైరెక్టర్ వివరించారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే వారు కేవలం 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన 6 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను, రెండో దశలో ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు వారికి నేరుగా తెలియజేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న వారు ఆ తర్వాత ఎన్యుమరేటర్ వచ్చినప్పుడు తమకు వచ్చిన రిఫరెన్స్ నంబర్‌ను చూపిస్తే సరిపోతుంది. ఒక కుటుంబం సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్నా, లేకపోయినా, రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ రావడం తప్పనిసరి అని డైరెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయని వారి నుంచి ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరిస్తారు. ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించి ఖచ్చితమైన వివరాలను అందించాలని ఆమె కోరారు. మే 10వ తేదీ వరకు గడువు ఉన్నందున, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com